ప్రజాశక్తి
సోమవారం 28 జులై 2025 5
శ్రీ సత్యసాయి

ప్రభుత్వ స్థలంలో జెండాలు పాతి గుడిసెలు వేస్తున్న నాయకులు, పేదలు

ఇళ్లస్థలాల కోసం భూపోరాటం

పేదలతో కలిసి జెండాలు పాతిన సిపిఎం

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఇళ్లస్థలాలు కోసం పేదలతో కలిసి సిపిఎం ఆధ్వర్యంలో జెండాలు నాటారు. ఈ మేరకు ఆదివారం కదిరిటౌన్ అమీన్ నగర్,న్యూ అమీన్ నగర్ పరిధిలో వున్న పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సైదాపురం పొలం సర్వే నెంబర్ 294 ప్రభుత్వ భూమిలో సిపిఎం ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 5 నెలల నుంచి ఇళ్ల స్థలాలు కేటాయించాలని సచివాలయాల వద్ద, తాహశీల్దార్ కార్యాలయం వద్ద, పుట్టపర్తి జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద ఆందోళన నిర్వహించామని తెలిపారు. సచివాలయాల్లో ఇంటి స్థలం కోసం దరఖాస్తులు అందజేసి నాలుగు నెలలు అవుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు దరఖాస్తులను విచారణ కూడా చేయలేదన్నారు. రోజువారి కూలి డబ్బులతో కుటుంబాలను పోషించుకోవడమే భారంగా ఉందన్నారు. ఇంటి అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న పేదలకు పాత,కొత్త అమీన్ నగర్ పరిధిలోని 294 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణంలో ఇల్లు లేని పేదలకు రెండు సెంట్ల స్థలం కేటాయిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు ఒక్కరికి కూడా ఇంటి స్థలం ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ ఇళ్లపట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.ఎల్. నరసింహులు, నాయకులు జగన్మోహన్, సాంబశివ, బాబ్జాన్, శాంతిభాయి, రాంమోహన్,నారాయణ, ముస్తక్,ఉదయ్, సుధాకర్ రెడ్డి మహిళలు తదితరులు పాల్గొన్నారు.

1100 కాల్ సెంటర్ సేవలు వినియోగించుకోండి

కలెక్టర్ టిఎస్ చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ టిఎస్ చేతన్ సూచించారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఈ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన అర్జీలకు పరిష్కారం కాకుంటే ఈ కాల్ సెంటర్ ద్వారా తెలుసుకోవచ్చున్నారు. సోమవారం ఎప్పటిలాగానే కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అర్జీలు స్వీకరించడం జరుగుతుందని, జిల్లాస్థాయి అధికారులందరూ పాల్గొంటారని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

కాల్‌మనీ ఆగడాలు

ఉమ్మడి జిల్లాలో శృతిమించుతున్న అరాచకాలు

మొన్న అనంతలో.. ఇప్పుడు ధర్మవరంలో...

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పేదల అవసరాలకు అధిక వడ్డీలకు అప్పులివ్వడం..ఇవ్వకపోతే దాడులు చేయడం వంటి ఘటనలు ఉమ్మడి అనంతపురం జిల్లాలో వరుసగా చోటు చేసుకుంటున్నాయి. మొన్న అనంతపురం నగరంలో కాల్ మనీ గ్యాంగ్ ఆగడాలు వెలుగుచూడగా నేడు ధర్మవరంలో వెలుగులోకి వచ్చాయి. వారానికి పది రూపాయలు వడ్డీకి అప్పులిస్తూ జలగల్లా పేద ప్రజలన పట్టిపీడిస్తున్నారు.

ధర్మవరంలో వెలుగులోకి వచ్చిన కాల్‌మనీ అరాచకాలు

రాజ్ అనే వడ్డీ వ్యాపారి గ్యాంగ్ ధర్మవరంలోని శాంతినగర్‌కు చెందిన రమణ అనే వ్యక్తిఇంట్లోకి దూరికొట్టిన వీడియోలు వైరల్‌గా మారాయి. రమణ కొద్ది రోజుల క్రితం రాజా వద్ద నుంచి రెండు లక్షల రూపాయలు అప్పు తీసుకున్నాడు. మరో ఇద్దరి వ్యక్తులకు అప్పు ఇప్పించాడు. మొత్తం ఆరు లక్షల రూపాయలకు పూచి పడ్డాడు. ఇప్పటికే రూ.15 లక్షలకుపైగా వారికి చెల్లించాడు. కాని ఇంకా డబ్బు ఇవ్వాలంటూ రాజా గ్యాంగ్ రమణ ఇంట్లోకి దూరి చావబాదారు. ఇంట్లో మహిళలు, చిన్న పిల్లలు కేకలు పెడుతున్నా ఏ మాత్రం పట్టించుకోకుండా కర్కశంగా దాడి చేశారు. ఈ సంఘటన ఈనెల 23వ తేదీ జరుగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గతంలోనూ రాజా గ్యాంగ్ ఇదే రకంగా వ్యవహరించి జైలుకు కూడా వెళ్లివచ్చింది. ఇలా వరుస ఘటనలు చోటు చేసుకున్నా రాజా గ్యాంగ్ ఆగడాలు మాత్రం ఆగడం లేదు. కూతురు వివాహం కోసం దాచుకున్న డబ్బులిచ్చినా రాజా గ్యాంగ్ కనికరం లేదని బాధితుడి భార్య భారతి వాపోయింది. కొంత గడువు ఇస్తే అసలు మొత్తం చెల్లిస్తామని చెబుతున్నా రాజా మనుషులు ఇంటికొచ్చి దాడి చేశారని బాధితుడు రమణ తెలిపాడు.

అనంతలోనూ ఇదే తీరు

అనంతపురం నగరంలోనూ పాతూరులో ఇదే రకమైన గ్యాంగ్‌లు నడుస్తున్నాయి. రోజు వారి వడ్డీ, వారం వడ్డీలకు అప్పులిచ్చి పేద ప్రజలను పీల్చిపిప్పి చేస్తున్నారు. సకాలంలో డబ్బులు చెల్లించలేదనే నగరంలోని వీధుల్లోనే బాహాటంగా దాడి చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ విషయం బయటకు పొక్కడంతో పోలీసులు స్పందించి వడ్డీ వ్యాపారులకు హెచ్చరికలు కూడా చేశారు. అయినా ఈ గ్యాంగ్‌ల తీరులో మార్పులేదన్న విమర్శ ఉంది. రోజు వారీ, వారం అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారు. కట్టకపోతే ఇళ్ల వద్దకెళ్లి దాడులు చేస్తున్నారు. అయితే ఇందులో చాలా తక్కువ కేసులే బయటకొస్తున్నాయి. వడ్డీ వ్యాపారుల ఒత్తిడికి తలొగ్గి బయట చెప్పుకునేందుకు కూడా భయపడుతుండటం గమనార్హం.

వ్యర్థాల నమూనాను సేకరిస్తున్న అధికారులు

కదిలిన కాలుష్య నియంత్రణ అధికారులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడలో ఉన్న రసాయన పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాల నమూనాలను కాలుష్య నియంత్రణ అధికారులు ఆదివారం సేకరించారు. 'జనంపై విష రసాయనం' శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనానికి కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్పందించారు. తూమకుంట పారిశ్రామిక వాడలో వ్యర్థాలను వేసిన ప్రాంతాన్ని కాలుష్య నియంత్రణ మండలి అధికారి మహేష్ సందర్శించి నమూనాలను సేకరించారు. సేకరించిన నమూనాలను పరీక్షలు చేసి ఏ పరిశ్రమ నిర్వాహకులు వ్యర్థాలను వేశారో ఆ పరిశ్రమపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అయితే నమూనా సేకరణ సమయంలో అక్కడే ఉన్న తూమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం అధ్యక్షులు రవికుమార్, ఉపాధ్యక్షులు బాబు మాట్లాడుతూ గతంలో కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వచ్చి నమూనాలను సేకరించారని, అయితే ఇప్పటివరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడలోని రసాయన పరిశ్రమల నిర్వాహకులు వ్యర్థాలను వేశారని, వేసిన వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోకపోతే తాము లోకాయుక్తను ఆశ్రయిస్తామని అధికారులకు హెచ్చరించారు.

అవినీతి అధికారుల గుండెల్లో గుబులు

ఇప్పటికే ఏసీబికి చిక్కిన పలువురు ఉద్యోగులు

తాజాగా ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ భాగోతం

అవినీతి మత్తు వీడని యంత్రాంగం

కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కళ్యాణదుర్గం ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్ట్రార్ నారాయణస్వామి ఏసీబీకి ట్రాప్ కావడం, గతంలో కొందరు ఇక్కడి అధికారులు ఏసీబీ వలలో ఇరుక్కున్న సంఘటనలు గుర్తు తెచ్చుకుంటున్న ఇప్పటి అవినీతి అధికారుల గుండెల్లో గుబులు మొదలైంది. దశాబ్దాల కాలంగా కళ్యాణదుర్గం నియోజవకర్గంలో ఏసీబీ దాడుల్లో దొరికిపోయిన అధికారుల తతంగాలను గుర్తుచేసుకుంటూ తమకు ఎలాంటి ఇబ్బందులెదురవుతాయోనని వారు ఆందోళనకు గురవుతున్నట్లు తెలుస్తోంది. భూ పోరాటాలకు పురిటిగడ్డగా పేరొందిన కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అవినీతిలో మునిగిపోయిన అధికారులు ఈప్రాంతానికి మచ్చతెచ్చి పెట్టారు. మంచికి మారుపేరైన ఈ ప్రాంతంలో రానురాను రాజకీయ పరిస్థితులు మార్పు కారణంగా అవినీతి అధికారులకు అందలం లభిస్తోంది. చివరికి అవినీతి మత్తులో మునిగిపోయి ఏసీబీ ట్రాప్‌లో ఇరుక్కుపోతున్నారు. ఇటీవల ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ రూ.5లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండ్‌గా పట్టుబడడంతో అవినీతి అధికారుల్లో కలవరం మొదలైంది. ఇప్పటికే పలు పనుల కోసం అవినీతికి పాల్పడిన రెవెన్యూ, పోలీస్, విద్యుత్ శాఖ, పంచాయతీరాజ్, మున్సిపాలిటీలలో పనిచేసే అధికారుల్లో లోలోపల కంగారు కనిపిస్తోంది. తాము ముడుపుల కోసం వేధిస్తున్న వ్యక్తుల నుంచి ఏసీబీ ముప్పు పొంచివుందేమోననే ఆందోళనకు గురవుతున్నారు. ప్రధానంగా కళ్యాణదుర్గం పోలీస్, రెవెన్యూ శాఖలో ఇది ఎక్కువగా కనిపిస్తోంది.

రెవెన్యూ, పోలీస్ శాఖలలో అవినీతి కంపు : . కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పనిచేస్తున్న రెవెన్యూ, పోలీస్ శాఖలలో అవినీతి కంపుకొడుతోంది. పోలీస్ శాఖలో ఉన్నతస్థాయి అధికారి తనస్థాయిని మరిచి అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. వివిధ సెటిల్‌మెంట్లు, పెద్ద కేసుల పరిష్కారం, స్టేషన్ల తనిఖీ సమయంలో ముడుపులు, వివిధ అక్రమమార్గాల ద్వారా లబ్ధి పొందే వర్గాల నుంచి నెలసరి ఆదాయాలు లక్షల రూపాయల్లో అందుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తన ఆధీనంలో పనిచేస్తున్న కిందిస్థాయి అధికారులు సైతం అవినీతిలో మునిగిపోయారు. బాధితులు ఏదైన సంఘటనపై ఫిర్యాదు చేస్తే నాన్చుడు ధోరణి వ్యవహరించడం, దుప్పటి పంచాయితీలు నిర్వహించి కేసులు నీరుగార్చే పనిలో నిమగ్నమైనట్లు విమర్శలున్నాయి. కొన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మహిళలను వేధిస్తున్న కేసుల్లో ముడుపులు తీసుకుని చిన్నస్థాయి కేసులు నమోదు చేసి 41-నోటీస్ జారీ చేసి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించిన సంఘటనలు కొక్కల్లలున్నాయి. ఓ పోలీస్ సర్కిల్‌లో వరుస చోరీలు జరుగుతున్న కేసులు నమోదు కాలేదు. ఈవిషయమై బాధితులు ఓ పోలీస్ అధికారిని సంప్రదిస్తే చూస్తాం, చేస్తాం అంటూ దాటవేసే ధోరణి అవలంభిస్తున్నట్లు బాధితుల నుంచి విమర్శలు వినపడుతున్నాయి. ఇదే తరహాలోనే మరికొంతమంది ఎస్‌హెచ్ఒలు వారి పరిధిలో ప్రతి కేసులోను చేతులు తడపనిదే పరిష్కారం చూపడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వారిపై కూడా ఏసీబీ కన్ను వుందని ప్రచారం జోరుగా సాగుతోంది. ఇక రెవెన్యూ శాఖలో అవినీతి తతంగం అంతాఇంతాలేదు. గ్రామకంఠాల స్థలాలు రిజిస్ట్రేషన్‌ల కోసం జారీ చేసే ధ్రువీకరణ పత్రాల జారీకి ఏకంగా ధరలను నిర్ణయించడం చర్చనీయాంశంగా మారింది. కనీస పరిజ్ఞానం లేని వ్యక్తులు డాక్యుమెంట్ రైటర్లుగా కేంద్రాలు ఏర్పాటు చేసుకుని ఫోర్జరీ సంతకాల తతంగాలను మూడు పువ్వులు, ఆరు కాయలుగా నడుపుతున్నట్లు తెలుస్తోంది. ఏకంగా తహశీల్దార్ సంతకాలను ఫోర్జరీ చేసిన సంఘటనలు వెలుగుచూడగా బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇంత వరకు కేసులు నమోదు కాలేదంటే రెండు శాఖల మధ్య అవినీతి సమన్వయం ఏస్థాయిలో వుందో అర్థం చేసుకోవచ్చు. పలువురు తహశీల్దార్లు, ఆర్ఐలు, వీఆర్‌వోలు అధికార పార్టీ నేతల ఆదేశాలనుసారం నడుచుకుంటున్నట్లు విమర్శలున్నాయి. ఇందులో భాగంగానే అడంగల్ మార్పులు, సర్వేలకు ముడుపులు అందకపోతే పనులు ముందుకు సాగడం లేదు. పనులకోసం వెళ్లిన వారిని వేధిస్తున్న సంఘటనలు కూడా వెలుగుచూస్తున్నాయి. ఇలా విసిగిపోయిన బాధితులు ఏసీబీని ఆశ్రయించే ఆలోచనలో పడ్డారు. ఇక నియోజకవర్గంలో దశాబ్దాల కాలంగా ఏసీబీ ట్రాప్ అయిన అధికారులను పరిశీలిస్తే పదుల సంఖ్యలోనే ఉన్నారు. రెండు దశాబ్దాల క్రితం కళ్యాణదుర్గం ఎమ్మార్వో సురేష్‌కుమార్ ఏసీబీకి పట్టుబడ్డారు. అనంతరం వీఆర్‌వో నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మారెప్ప, బ్రహ్మసముద్రం ఆర్ఐ వెంకటేశులు (ప్రస్తుత ఆర్డీఓ కార్యాలయ డీటీ), సర్వేయర్ హేమసుందర్, కుందుర్పి మండలంలో ఓ వీఆర్‌వో, శెట్టూరు మండలంలో మరో వీఆర్‌వో, ఇటీవల కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామి ఏసీబీకి పట్టుబడిన వారిలో ఉన్నారు.

సూపర్ - 6ను గాలికొదిలేసారు

వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక

ప్రజాశక్తి-హిందూపురం

ఎన్నికల సమయంలో ఇచ్చి సూపర్ 6 హామీలను అధికారం వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందని వైసిపి హిందూపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక విమర్శించారు. ఆదివారం మండల పరిధిలోని గోలాపురం, తూమకుంట, సంతేబిదనూరు పంచాయతీలలో వైసీపీ మండల కన్వీనర్ రాము ఆధ్వర్యంలో నిర్వహించిన 'బాబు షూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గడప గడపకు తిరుగుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రజలను జరిగిన నష్టాన్ని, మోసాన్ని వివరించారు. ఈ విషయాలు అన్నింటిని ప్రజలు అందరూ గమనించి రాబోవు రోజులలో ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మధుమతి రెడ్డి, వైసీపీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు..

వైసీపీలో చేరిన టీడీపీ సానుభూతిపరులు : పట్టణంలోని 12వ వార్డుకు చెందిన టీడీపీ సానుభూతిపరులు స్థానిక వైఎస్సార్సీపీ నాయకుడు వాల్మీకి వెంకటేష్ ఆధ్వర్యంలో వైసిపిలోకి చేరారు. ఆదివారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో పార్టీలోకి చేరిన వారికి వైసీపీ ముఖ్య నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి పార్టీ కండువాలను కప్పి వైసిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ 2024 ఎన్నికలలో భాగంగా చంద్రబాబు నాయుడు మోసపూరిత హామీలను నమ్మి ఆ పార్టీ కోసం పనిచేశామని, ఏడాది గడుస్తున్నా హామీలు నెరవేర్చకపోవడంతో విసుగు చెంది వైసీపీలోకి చేరామని వారు తెలిపారు. పార్టీలోకి చేరిన వారిలో శ్రీరామ, నంద, శివ, అంజి, రామంజి, రమేష్, అతావుల్లా, షఫీ, సుభాన్, రాము, రవి, ముస్తాక్, మంజు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు ఇన్‌ఛార్జి సహేరా బాను, సీనియర్ నాయకులు శ్రీరాములు గౌడ్, డిష్ చాంద్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలోకి చేరిన వారితో వైసిపి నాయకులు వేణురెడ్డి

గ్రంథావిష్కరణలో ప్రముఖులు

'మంకుతిమ్మన కగ్గ' గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణానికి చెందిన శ్రీకృష్ణదేవరాయ గ్రంథమాల ఆధ్వర్యంలో కల్లూరు జానకీ రామారావు తెలుగులోకి అనువదించిన డివిజి కన్నకృతి 'మంకుతిమ్మన కగ్గ' గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు జీవరత్నమ్మ సభాధ్యక్షత వహించగా, మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ కుమార్, ఎంఇఒ గంగప్ప పాల్గొన్నారు. రచయిత కల్లూరు రాఘవేంద్రరావు పుస్తక పరిచయం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కన్నడ, తెలుగు భాషలోని పుస్తకాలను అనువదించి పుస్తకావిష్కరణ చేయడం తెలుగు, కన్నడ భాషలను గౌరవించి చైతన్యపరిచి భాషా పరిరక్షణ చేయటమేనని అన్నారు. భాషలను నిర్మూలన చేస్తున్న ఈ పరిస్థితుల్లో ఇలాంటి పుస్తకాలు రావటం శుభపరిణామని అన్నారు. అంతేకాకుండా పరస్పర భాషాభిమానులను ఆహ్వానించదగ్గ విషయమన్నారు. గ్రంథ అనువాధకుడు కల్లూరు జానకీ రామారావు మాట్లాడుతూ కన్నడ ప్రజలు ఈ పుస్తకాన్ని భగవద్గీతగా గౌరవిస్తారని అన్నారు. అనంతరం కల్లూరు ఉమర్ఫారూక్ ఖాన్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు, తెలుగు భాషాభిమానులు. లైఫ్‌వరల్డ్ ఉదయ్‌కుమార్ చైతన్య గంగిరెడ్డి, హైదర్ వలీ, మిస్త్రీమిల్, రచయిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు, యువత క్రీడలపై దృష్టి సారించాలి

జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి ఉదయ్‌భాస్కర్

జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి ఉదయభాస్కర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని యువత ఆటలు ఆడకపోతే ఎన్నో అనర్థాలు సంభవిస్తాయని, అందుచేత విద్యార్థులు చదువుతోపాటు క్రీడారంగంలో కూడా ప్రతిభ కనబరిస్తే ఎంతో మేలు జరుగుతుందనిశ్రీ సత్యసాయి జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి ఉదయ భాస్కర్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

ప్రశ్న : ఉమ్మడి జిల్లాలో క్రీడా వికాస కేంద్రాలు ఎన్ని ఉన్నాయి? వాటి వలన ఏయే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు ?

జవాబు: ఉమ్మడి జిల్లాలో క్రీడా వికాస కేంద్రాలు 14 ఉన్నాయి. అనంతపురం జిల్లాలో 7, శ్రీ సత్య జిల్లాలో ఏడు ఉన్నాయి. పెనుగొండ, మడకశిర ,ధర్మవరం కేంద్రాల పనులు పూర్తి అయ్యాయి. కొత్తచెరువులో స్టేడియం పనులు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాం. స్పందించిన ఆయన వాటికి నిధులు వెంటనే మంజూరు చేసి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నిధులు మంజూరు అయితే పనులు పూర్తి చేస్తాం.

ప్ర : కేంద్రం నుండి క్రీడాకారులకు వచ్చే నిధులు ఏవేవి ?

జ : కేంద్ర ప్రభుత్వం నుండి రెండు విధాలుగా నిధులు మంజూరు అవుతాయి. దాతలు స్థలం చూపితే వారు నిర్మాణాలు చేపట్టి స్టేడియంలో నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి అనుమతులు మంజూరు చేస్తారు. జిల్లా వ్యాప్తంగా ధర్మవరంలో హాకీ ఆటస్థల నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. డే బోర్డర్ స్కీం కింద ఆట వస్తువులను అందజేయడం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు.

ప్ర : క్రీడాకారులకు ఏయే ప్రోత్సాహకాలు ఇస్తున్నారు ?

జ : గతంలో క్రీడాకారులకు జీవో నెంబర్ నాలుగు ద్వారా గ్రూప్ వన్ ఉద్యోగాలు సైతం వచ్చేవి. ప్రస్తుతం ప్రభుత్వం క్రీడాకారులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తుంది. ఎలాంటి అర్హత లేకున్నా రాష్ట్ర క్రీడాకారుల కోటాలో ఈ నిర్ణయం తీసుకుంటుంది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 425 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. పరీక్షలు రాయకుండా ఉద్యోగం పొందవచ్చు, వ్యాయామ ఉపాధ్యాయునిగా ఎక్కడ నుంచి అయినా దరఖాస్తు చేసుకుని ఉద్యోగం పొందవచ్చు అనంతరం పీఈటీ కోర్సు పూర్తి చేసుకోవచ్చు.

ప్ర : జిల్లాలో క్రీడాకారుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ : సత్యసాయి జిల్లాలో క్రీడాకారుల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఒక్కో ప్రాంతంలో ఒక్కొక్క ఆటకు ప్రాధాన్యత కల్పించి అక్కడ క్రీడాకారులను ప్రోత్సహించి వాటిలో ప్రతిభ కనబరిచే విధంగా చర్యలు చేపడుతున్నాం. ధర్మవరం ప్రాంతంలో బాక్సింగ్, హాకీ ఆటలకు ప్రాధాన్యత కల్పించి వాటి అభివృద్ధికి కృషి చేస్తున్నాం. అదేవిధంగా కదిరి ఫెన్సింగ్ (కత్తి యుద్ధం) ,పెనుగొండ షటిల్ బ్యాట్మింటన్, హిందూపురం, రామగిరి అథ్లెటిక్, ఫుట్‌బాల్ తదితర ఆటలకు ప్రోత్సహిస్తూ వారికి తగిన ప్రోత్సాహం ఇస్తున్నాం.

ప్ర : వికలాంగులకు క్రీడారంగంలో అవకాశం కల్పిస్తున్నారా?

జ : వికలాంగులు క్రీడలలో రాణించడానికి వారికి అవకాశం కల్పిస్తూ శిక్షణ ఇస్తూ క్రీడల పట్ల ఆసక్తి కలిగేందుకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఎన్నో ప్రోత్సాహకాలు ఇస్తున్నాం. చదువుతోపాటు క్రీడల పట్ల విద్యార్థులను ఆసక్తి కలిగించే విధంగా ప్రోత్సహిస్తున్నాం.

విద్యుత్ తీగలు సరి చేయరూ..?

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని శిరిడిసాయి కాలనీలో ఎస్‌పివివిఎం డిగ్రీ కళాశాల వెనుక ప్రాంతంలో విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన వైర్లు కిందికి వేలాడుతున్నాయి. దీంతో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందో అని ఈ ప్రాంత ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ వైర్లు అతి తక్కువ ఎత్తులో వేలాడుతుండడంతో వాహనాలకు తగులుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. విద్యుత్ స్తంభాలు కూడా తుప్పు పట్టి పక్కకు ఒరిగిపోయాయి. కళాశాల ముందు భాగంలో విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో స్థానికులు తమ ఇళ్లకు కట్టెల ఆధారంగా విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసుకున్నారు. ఇకనైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు, తీగలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లు

ఎమ్మెల్యే రాజు, గుండుమల, కుమార్‌స్వామిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

అగళి సింగిల్‌విండో అధ్యక్షులుగా కుమార్‌స్వామి

ప్రజాశక్తి-అగళి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, ఉమ్మడి అనంతపురం జిల్లా ఎడిసిసి బ్యాంక్ ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి సమక్షంలో సింగిల్‌విండో అధ్యక్షుడిగా కుమార్‌స్వామి ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన వారికి ఖచ్చితంగా గుర్తింపు ఉంటుందన్నారు. ఇప్పుడు అవకాశం రాని వారికి భవిష్యత్తులో ఖాళీగా ఉన్న డైరెక్టర్, మిగతా పోస్టుల్లో నియమిస్తామని హామీ ఇచ్చారు. కుమార్‌స్వామి పార్టీ కోసం సుదీర్ఘ కాలంగా పని చేశారని, అందుకు ఈ పదవి దక్కిందన్నారు. బ్యాంక్ ఛైర్మన్ కేశవరెడ్డి మాట్లాడుతూ కొత్తగా ఎడి సిసి బ్యాంకు భవనాన్ని మంజూరు చేస్తామని తెలిపారు. సింగిల్‌విండో భవనాన్ని పూర్తి చేసి తీరుతా మని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌మూర్తి, జడ్పిటిసి ఉమేష్ ఎంపిపి రేణుక కామరాజు, మడకశిర మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గురు మూర్తి, మండల కన్వీనర్ తిప్పేస్వామి, టిడిపి ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు సింగిల్‌విండో అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-గుడిబండ

స్థానిక ఎడిసిసి బ్యాంక్ ఆవరణలో సోమవారం ఉదయం 10 గంటలకు సింగిల్‌విండో అధ్యక్షులుగా మద్దనకుంటప్పతో డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేస్తారని టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, డైరెక్టర్ ప్రకాష్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపి బికె.పార్థ సారథి, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస మూర్తి, ఎడిసిసి బ్యాంక్ ఛైర్మన్ శివారెడ్డి హాజరవతారని తెలిపారు. కావున మండలంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

మద్దనకుంటప్ప

ధ్యానంతో ఆనందం, ఆరోగ్యం

ప్రజాశక్తి-బత్తలపల్లి

ధ్యానం చేయడం వల్ల ఆనందం, ఆరోగ్యం, తృప్తి కలుగుతాయని ధర్మవరం సీనియర్ పిరమిడ్ గ్రేట్ మాస్టర్లు సుబ్బరత్నమ్మ, కృష్ణమూర్తి దంపతులు పేర్కొన్నారు. ఆనందం కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక శ్రీహరి హర పిరమిడ్ ధ్యాన మందిరంలో సజ్జన సాంగత్యం తరగతులు నిర్వహించగా ఆ దంపతులు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. మన బాహ్య శరీరంలో స్థూల శరీరం, సూక్ష్మ శరీరం, కారణ శరీరం అనే మూడు భాగాల గురించి వివరించారు. ఆనందం గురించి అద్భుతమైన ఆత్మ జ్ఞానాన్ని తెలిపారు. హాజరైన వారందరికీ రామాపురం కప్పల కొండప్ప పేరు మీదుగా వారి భార్య కప్పల లక్ష్మీదేవి కుటుంబ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ గ్రేట్ మాస్టర్లు కొండన్న, నాగేంద్ర, గోపాల్, యశోద, వివిధ గ్రామాల నుంచి సుమారు 70 మంది హాజరయ్యారు.

నీరు విడుదల చేస్తున్న ఛైర్మన్ రేనాటి శ్రీనివాసులు, ఎపి సీడ్స్ డైరెక్టర్ కమతం కాటమయ్య, మహేష్ చౌదరి

చివరి ఆయకట్టుకు నీరివ్వడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ధర్మవరం చెరువు చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కూటమి నాయకులు తెలిపారు. సాగునీటి సంఘం ఛైర్మన్ రేనాటి శ్రీనివాసులు, ఎపి సీడ్స్ డైరెక్టర్ కమతం కాటమయ్య, మహేష్ చౌదరి, తదితరులు ఆదివారం చెరువు తూముల ద్వారా నీటిని విడుదల చేశారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు ధర్మవరం చెరువు ఆయకట్టు కింద ఉన్న తుమ్మల, చిన్నూరు, మల్లెనపల్లి, ధర్మపురి గ్రామాలకి నీరు విడుదల చేశామ న్నారు. సొంత నిధులతో చెరువు కింద కాలువలు, జంగిల్ క్లియరెన్స్ ద్వారా చెట్లను తొలగించి చివరి వరకూ నీరు వెళ్లేలా చేశామన్నారు. దాదాపు 1500 ఎకరాలు సాగయ్యేలా సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు పరిసే సుధాకర్, డీలర్ కుళ్లాయప్ప, రాళ్లపల్లి షరీఫ్, విజయసారథి, మేకల రామాంజనేయులు, విజయ్‌చౌదరి, ఏగినాటి రమణ, జంగం నరసింహులు, అమరా సుధాకర్, చెరువు సంఘం డైరెక్టర్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని పెద్దిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం అల్లూరి యువసేన ఆధ్వర్యంలో అభయాంజ నేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. వేకువజామున 4 నుంచే విగ్రహ ప్రాణ ప్రతిష్ట పూజలు, హోమాలు, అభిషేకాలు, పూర్ణాహుతి, ఇతర ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం, అన్న ప్రసాదం కార్యక్రమాలు నిర్వహించారు. సేవా మందిర్ ట్రస్ట్ అధ్యక్షుడు కెటి.శ్రీధర్, బ్యాంకు మేనేజర్ నాగబాబు. టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, బాలాజీ, జడ్పిటిసి సూర్యనారాయణ, సోమప్ప, శ్రీనివాసులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అల్లూరి యువసేన ట్రస్ట్ నిర్వాహకులు రాజేష్ రెడ్డి, బాలాజీ, నంజుండ, మంజునాథ్, కిషోర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, హరికుమార్, ప్రవీణ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జూలారెడ్డి, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న నాయకులు, ప్రజలు

'జననీ సురక్ష యోజన'పై నిర్లక్ష్యం!

◆ ప్రభుత్వ ఆశయానికి తూట్లు..
◆ గర్భిణులు, బాలింతలకు అందని ప్రయోజనాలు

పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం జననీ సురక్ష యోజన(జెఎస్‌వై) పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఈ పథకం జిల్లాలో పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని తెలుస్తోంది. ఆసుపత్రిలో చేరిన గర్భిణి ప్రసవమై డిశ్చార్జ్ అయ్యే లోపు తల్లి వివరాలన్నీ యాప్‌లో నమోదు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలి. అయితే వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో పూర్తి స్థాయిలో తల్లులకు జననీ సురక్ష యోజన పథకం ప్రయోజనాలు అందడం లేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

తల్లుల ఖాతాలకు చేరని నగదు..

ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన గర్భిణి ప్రసవమై ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లే లోపు యాప్ ద్వారా వివరాలన్నీ సరిగా పంపితే తల్లి బ్యాంకు ఖాతాలో రూ. 1500 జమ చేస్తారు. యాప్‌లో వివరాలు నమోదు చేయడంలో వైద్య శాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా చాలా మంది తల్లులకు జెఎస్‌వై పథకం ఆర్థిక ప్రయోజనం అందడం లేదు. జిల్లాలో కనీసం 55 శాతం మందికి ఈ పథకం వర్తించడం లేదంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో స్పష్టమవుతోంది.

64 శాతం మంది దరఖాస్తు

జిల్లాలో 'జననీ సురక్ష యోజన పథకం' పనితీరు దారుణంగా ఉంది. 64 శాతం మందికి తల్లులకు మాత్రమే 'జెఎస్‌వై' కింద సొమ్ము వర్తించింది. ప్రసవం జరిగిన ఆసుపత్రిలో దరఖాస్తు చేయకపోవడం వల్లే వేలాది మంది బాలింతలు సొమ్మును కోల్పోతున్నారు.

ఆసుపత్రిలో దరఖాస్తు చేయకపోవడం వల్లే..

గర్భిణి ఆసుపత్రికి రాగానే వివరాలు సేకరించి ఎంఎస్‌ఎస్(మాతా శిశు సురక్ష) వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. భర్త పేరు, ఆధార్, బ్యాంకు ఖాతా నంబర్లు పంపించాలి. ఈ వివరాలు పిహెచ్‌సిలు, సిహెచ్‌సిల్లో అప్‌లోడ్ చేయడానికి సిబ్బంది లేరు. ఉన్నా చాలా చోట్ల వాళ్ల వివరాలు నమోదు చేయడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నమోదు లేకపోతే ఇక ప్రయివేటు ఆస్పత్రుల్లో అసలే లేదు. దీంతో వేలాది మంది బాలింతలకు లబ్ధి చేకూరడం లేదు.

ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన శూన్యం

'జెఎస్‌వై' సరిగా నమోదు కాకపోవడంతో ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన కింద అందే రూ. 6 వేలను కూడా చాలా మంది తల్లులు కోల్పోతున్నారు. ఆసుపత్రి యాజమాన్యాల నిర్లక్ష్యంతో కేంద్రం ఇచ్చే నిధులకు పేద బాలింతలు నోచుకోవడం లేదు.

నమోదైన వివరాలు..

జిల్లాలో హెచ్‌ఎంఐఎస్‌లో నమోదైన ప్రసవాలు 5,280 కాగా ఎంఎస్‌ఎస్(మాతా శిశు సురక్ష నమోదు)లో 4,085 నమోదయ్యాయి. వీటిలో 3,427 మంది బాలింత తల్లులు లబ్ధి పొందారు. మిగిలిన తల్లులు జననీ సురక్ష యోజన పథకం ప్రయోజనం అందుకోలేకపోయారు.

'జెఎస్‌వై' విషయమే తెలీదు : లక్ష్మీదేవి, శెట్టిపల్లి

ఆసుపత్రుల్లో గర్భిణులు ప్రసవమైతే జననీ సురక్ష యోజన పథకం ద్వారా రూ. 1500 ఇస్తారనే విషయమే తెలీదు. మా అమ్మాయికి ఎలాంటి నగదు అందలేదు. వైద్య ఆరోగ్య శాఖ ప్రచారం చేయడం లేదు. తల్లుల వివరాలు నమోదు చేయడం లేదు. ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం కోల్పోతున్నాం.

పిఆర్‌సి, ఆర్థిక బకాయిలు చెల్లించాలి

యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న కె.సురేష్‌కుమార్

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పిఆర్‌సి, ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంఎస్‌ఆర్ రెసిడెన్సీలో ఆదివారం యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్ అధ్యక్షతన జిల్లా స్థాయి స్టడీ సర్కిల్ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన సురేష్‌కుమార్ మాట్లాడుతూ అధికారం లోకి వచ్చిన వెంటనే ఆర్థిక బకాయిలు చెల్లిస్తామని, 12 పిఆర్‌సిని అమలు చేస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి నాయకులు 13 నెలలైనా పట్టించుకోకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేయడమే అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్య ధోరణి తగదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులను పాత పెన్షన్ విధానంలోకి తీసు కురావాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనేతర పను ల నుంచి మినహా ఇంచాలన్నారు. బదిలీల ప్రక్రియ ముగిసినా రిలీవర్ లేక ఎక్కడి వాళ్లు అక్కడే ఆగిపోయాయని, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేనిచో ఆందోళనలు ఉధృతం చేస్తా మని హెచ్చరించారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్య క్షులు కె.భూతన్న, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, శివశంకర్, క్రిష్టప్ప, నరసింహప్ప, మాలింగప్ప, నగేష్, అజాంబాషా, సురేష్, లక్ష్మీపతి, శ్రీనివాసులు, గిరియప్ప పాల్గొన్నారు.

జిల్లా స్థాయి టీచర్స్ క్రికెట్ టోర్నీ

యుటిఎఫ్ నాయకులు జి.రామాంజనేయులు(రిటైర్డ్ పిఎస్ హెచ్‌ఎం) జ్ఞాపకార్థం నిర్వహించిన జిల్లా స్థాయి టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో టోర్నీ కన్వీనర్ జిసి.నరేష్‌కుమార్ ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, రిటైర్డ్ పిఎస్ హెచ్‌ఎం కృష్ణా నాయక్, జెవివి జిల్లా నాయకులు హరి, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న హాజరయ్యారు. తొలి మ్యాచ్‌లో ధర్మవరం, మడకశిర జట్లు పోటీ పడగా మడకశిర, మరో పోటీలో రొళ్ల, పెనుకొండ జట్లు పోటీ పడగా రొళ్ల జట్టు గెలిచాయి. ప్రతిభ చాటిన శేషు, అనిల్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో నాయకులు ఉపేంద్ర, గంగాధర్, శివయ్య, ఆది జినేష్, మారుతి, శేషాద్రి, విష్ణు, జగదీశ్, నరేష్ బాబు, కాశీ, వంశీ, పాల్గొన్నారు.

ఫారం పాండ్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యుడు దయాకర్‌రెడ్డి

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండలంలోని కటారుపల్లి పంచాయతీలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆదివారం కేంద్ర బృందం సభ్యులు దయాకర్‌రెడ్డి, జిల్లా పిడి విజయప్రసాద్, ఎపిడి రమేష్‌బాబు పరిశీలించారు. ఇందులో భాగంగా కటారుపల్లి క్రాస్ నుంచి కటారుపల్లి వరకూ చేపట్టిన సీసీ రోడ్డు, గొళ్లపల్లిలో ఫారం పాండ్‌ను పరిశీలించారు. అనం తరం మహిళా సంఘాల సభ్యులు, గ్రూప్ లీడర్లను కలిసి సంఘాల పని తీరు, బ్యాంకు రుణాలు, జీవనోపాధి, తదితర అంశాలను అడిగి తెలుసుకు న్నాడు. గ్రూపులు మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. వారి వెంట పిఆర్ జెఈ రెడ్డి శివప్రసాద్, ఎంపిడిఒ వెంకటరామిరెడ్డి, ఎపిఒ చంద్రశేఖర్, ఎపిఎం సూర్యశేఖర్, మహిళా సంఘాల సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

నవోదయ పూర్వ విద్యార్థుల రక్తదానం

ప్రజావక్తి-లేపాక్షి

అనంతపురంలోని పాతూరు రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం లేపాక్షి నవోదయ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 50 మందికిపైగా పూర్వ విద్యార్థులు రక్తదానం చేశారు. ఆ సంఘం ప్రెసిడెంట్ వేమనారాయణ, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ మనోరంజన్‌రెడ్డి, డాక్టర్ బివి. రమణ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల మరొకరి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఏటా నవోదయ విద్యాలయం పూర్వ విద్యార్థుల తరపున రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హిందూపూర్ లేబర్ ఆఫీసర్ రమణా రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సతీష్, రాజారెడ్డి, రియాజ్, మల్లికార్జున, శివన్న, శిద్దారెడ్డి, వినోద్, సైంటిస్ట్ జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

తలుపుల : స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం అనంతపురంలోని సన్ రే హాస్పిటల్ ఆధ్వర్యంలో ఎంపిపి రఫీనాయక్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సన్ రే ఆసుపత్రి వైద్య నిపుణులు సుమారు 300 మందికి పైగా చక్కెర, రక్తపోటు, నరాలు, కిడ్నీ సంబంధిత వ్యాధులకు పరీక్షలు చేశారు. సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ సురేంద్రబాబు, నెఫ్రాలజిస్ట్ కిడ్నీ నిపుణుడు డాక్టర్ రామ్మోహన్, న్యూరో సర్జరీ డాక్టర్ రామ్మోహన్, సన్ రే హాస్పిటల్ సిఒఒ విశ్వనాథరెడ్డి, రామాంజనేయులు, ప్రజలు పాల్గొన్నారు.

శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

రౌడీషీటర్లకు డీఎస్పీ కౌన్సెలింగ్

లేపాక్షి : స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం డీఎస్పీ మహేష్ రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. డీఎస్పీ మాట్లాడుతూ మండలంలో ఎక్కడా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకూడదన్నారు. ప్రజలు పేకాట, మట్కా, గొడవలు, తదితర వాటికి దూరంగా ఉంటూ ప్రశాంతమైన జీవితం గడపాలని సూచించారు. గతంలో జరిగిన విషయాలను మరిచిపోయి అందరితో సామరస్యంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో సిఐలు జనార్దన్, ఆంజనేయులు, కరీంసాబ్, ఎస్ఐ నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరంలో ట్రాఫిక్ నియంత్రణ భేష్ : ఎస్పీ

ధర్మవరం రూరల్ : పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణలో మరింత పురోగతి సాధించాలని ఎస్పీ వి.రత్న సూచించారు. ధర్మవరంలో ట్రాఫిక్ నియంత్రణపై ఎస్పీ సంతృప్తిని వ్యక్తం చేశారు. ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.వెంకట రాముడు విధుల్లో మంచి నైపుణ్యం కనబరచడం, సిబ్బందికి సూచనలు ఇవ్వడంలో సఫలమయ్యారని ప్రశంసించారు. ఈ మేరకు శనివారం పుట్టపర్తిలో ఎస్ఐ వెంకటరాముడుకు ఎస్పీ ప్రశంసాపత్రం అందజేశారు. ఎస్ఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు కూడా సహకరించాలని, వాహన దారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. ధర్మవరంలో ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బంది సహకారంతో మరింత కృషి చేస్తామని తెలిపారు.


ఎస్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్న ఎస్పీ

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-కొత్తచెరువు

సూపర్ సిక్స్‌తో పాటు ఎన్నికల హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైం దని పుట్టపర్తి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ధ్వజమెత్తారు. స్థానిక ధర్మవరం రోడ్డులోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోను గుర్తు చేస్తూ పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రజలకు ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత వాటిని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యార న్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలైనా అన్నదాత సుఖీభవ నిధులు అందక రైతులు ఆందోళనలో ఉన్నారన్నారు. వైసిపి పాలనలో అప్పటి సిఎం జగన్ ఎన్నికల హామీలను తూచా తప్పకుండా ప్రతి ఒక్కటీ అమలు చేశారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఎంపిపి గాయత్రిరెడ్డి, సర్పంచి రాధానాగరాజు, నాయకులు రాజారెడ్డి, నారాయణ, వాల్మీకి శంకర్, భాస్కర్, రఫీ, ఎస్.రామాంజనేయులు, హనుమంతరెడ్డి, ప్రభావ తమ్మ, పూజారి పెద్దన్న, జనార్దన్‌రెడ్డి, ఎల్లప్ప, వెంకటరాముడు, బళ్లారి బాబు పాల్గొన్నారు.


వైసిపి రూపొందించిన క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, నాయకులు

గుడిబండ : కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వైసిపి శ్రేణులు ప్రజల్లోకి విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హలుకూరు కాంతరాజు, మండల కన్వీనర్ డిఎల్ ఎన్.గౌడ్ పిలుపునిచ్చారు. మండలంలోని పిసి. గిరి, దేవరహట్టి, కరికెర, తదితర గ్రామ పంచాయతీల్లో ఆదివారం వైసిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి రాధమ్మ, జడ్పిటిసి భూతరాజు, కరికెర సర్పంచి గౌరమ్మ, శివన్న, మండల కార్యదర్శి నాగరాజు, మారేగౌడ్, బోరన్న, రంగధామ, తిమ్మన్న పాల్గొన్నారు.

పేద వైద్యవిద్యార్థులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-కదిరి టౌన్

నల్లచెరువు మండలంలోని బాలేపల్లి తండాకు చెందిన వైద్య విద్యార్థులకు ఆదివారం హార్ట్ టు హెల్ప్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవినాయక్ మాట్లాడుతూ భూక్యా మౌనిక తిరుపతిలోని పద్మావతి మెడికల్ కాలేజ్‌లో, భూక్యా అఖిల్ తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర మెడికల్ కాలేజ్‌లో ఎంబిబిఎస్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. వీరిద్దరూ నిరుపేద కుటుంబాలకు చెందిన వారు కావడంతో వారి ఆర్థిక పరిస్థితులు అర్థం చేసుకున్న దాత బ్రహ్మానందరెడ్డి ఒక్కొక్కరికి రూ. 10వేల చొప్పున అందజేశారన్నారు. వారు మెడిసిన్ పూర్తి చేసేంద వరకూ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ మూడే లక్ష్మీదేవి, మూడే నరేష్‌నాయక్, ప్లానింగ్ సెక్రటరీ కమలమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఉపాధి' అవినీతిపై నిగ్గు తేల్చండి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో జరిగిన అవినీతిపై నిగ్గు తేల్చాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్, సిఐటియు నాయకులు పైపల్లి గంగాధర్, పెడపల్లి బాబా ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రధానంగా చిలమత్తూరు మండలంలో ఉపాధి హామీ పనుల్లో పెద్దఎత్తున అవినీతి జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, కూలీలకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ చట్టం అధికారులు, కూటమి నాయకుల జోక్యంతో అవినీతిమయమైందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి నాయకులు ఉపాధి హామీలో కోట్ల రూపాయలు దుర్వినియోగం చేస్తున్నారన్నారు. అధికారం అడ్డు పెట్టుకొని కూలీల కడుపుకొడుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే జిల్లా వ్యాప్తంగా సమగ్ర విచారణ జరిపి నిధులు దుర్వినియోగం చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

కార్మిక హక్కుల కోసం సమిష్టిగా పోరాడుదాం

ప్రజాశక్తి-కదిరి టౌన్

కార్మికుల హక్కులు, అక్రమార్కులపై చర్యల కోసం సమిష్టిగా పోరాడుదామని భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, కాకర్ల రఘునాథ్ పిలుపునిచ్చారు. పట్టణంలో ఆదివారం రామకష్ణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా పట్టణంతో పాటు నియోజకవర్గ పరిధిలోని భవన నిర్మాణ కార్మికులు హాజరయ్యారు. సంఘం సభ్యులు, నాయకులు మాట్లాడుతూ ప్రతి కార్మికుడు సభ్యత్వం తీసుకోవాలని, వారి హక్కుల సాధనకై సంఘం ద్వారా పోరాడుతుందన్నారు. ప్రధానంగా ఇళ్ల స్థలాలు, మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. భవన నిర్మాణ కార్మికులంతా ఏకతాటిపైకి వచ్చి సమస్యలు పరిష్కరించుకుందామని కోరారు.

ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం

ప్రజాశక్తి-కొత్తచెరువు

స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఎట్టకేలకు ఆదివారం అధికారులు ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. రెండు నెలల క్రితం గ్రామ పంచాయతీ, ఆర్అండ్‌బి, రెవెన్యూ శాఖల అధికారులు ఆక్రమణలు తొలగించుకో వాలని వంద మందికిపైగా యజమానులకు నోటీసులు జారీ చేశారు. అయితే వారు స్పందించకపోవడంతో శనివారం రాత్రి గడువు ఖాళీ చేసి ఆక్రమణలు తొలగించుకోవాలని పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ వారికి సూచించారు. ఆదివారం మధ్యాహ్నమైనా తొలగించకపోవడంతో స్థానిక పుట్టపర్తి రోడ్డు, పెనుకొండ రోడ్డు, ధర్మవరం రోడ్డులో అధికారులే జెసిబిల సాయంతో ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు.సిఐ మారుతిశంకర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ బాలాంజనేయులు, ఆర్ఐ కిరణ్, మండల సర్వేయర్ సురేష్, వీఆర్వో నజీర్, మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, విఆర్ఎలు, పాల్గొన్నారు.

జెసిబితో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

అబ్దుల్ కలాంకు నివాళి

పెనుకొండ : మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సమాజ హితం కోసం పాటుపడాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న కలాం విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన జీవితం, దేశానికి చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములు, లక్ష్మీనారాయణ రెడ్డి, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, నాయకులు రామకృష్ణ, రామాంజనేయులు, హనుమంతు, పాల్గొన్నారు.

నల్లమాడ : స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలోని కలాం విగ్రహానికి డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలాం దేశానికి రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కెబి.మంజు నాథ్‌రెడ్డి, కోట్లో మంజురెడ్డి, అరవింద్‌బాబు, నారాయణ నాయక్, అభి, నరసింహులు, పాల్గొన్నారు.

నల్లమాడలో కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా సత్యసాయి రథయాత్ర

కొత్తచెరువు : సత్యసాయి బాబా శతజయంతి వేడుకల్లో భాగంగా విశ్వశాంతి కోసం నిర్వహిస్తున్న ప్రేమ వాహిని రథోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. రథోత్సవం గ్రామంలోకి చేరుకోవడంతో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భజన మందిరం నుంచి పురవీధుల గుండా భక్తులు, విద్యార్థులు పలు వేషధారణలో ప్రజలను ఆకట్టుకుంటూ ర్యాలీ నిర్వహించారు. బాబా ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సత్యనారాయణమూర్తి, ఆధ్యాత్మిక సమన్వయకర్త శంకరనారాయణ, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

నాటుసారా తయారీ, విక్రయం నేరం

పుట్టపర్తి రూరల్ : నాటుసారా తయారు చేయడం, విక్రయించడం నేరమని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బుక్కపట్నం మండలం నారసింపల్లితండాలో నాటుసారా స్థావరాలు, తండా పరసర ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులు సోదాలు చేశారు. వారు మాట్లాడుతూ నాటుసారా తయారు చేసిని, అమ్మినా కఠిన చర్యలు తప్పవన్నారు. అలాగే నాటుసారా తాగడం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు వివరించారు. దాడుల్లో సిఐలు నాగరాజు, హరికృష్ణ, అలీబేగ్, ఎస్ఐలు ఉమామనోహర్‌రాజు, సత్యనారాయణ, ఫరూక్‌అజీం, శివప్రసాద్, బుక్కపట్నం ఎస్ఐ కృష్ణమూర్తి, వారి సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కదిరి వారి కోర్టులో

E.P. No. 36/2022 in O.S. NO. 138/2016

Between:
కె.యం.డి.అఫ్రోజ్ భాషా ...డిక్రీహోల్డర్
మరియు
బి.బాబ్ జాన్ @ బ్రాంహణపల్లి బాబ్ జాన్,
died rep. by LRs. 2 and 3. ...జడ్జిమెంట్ డేటార్స్

2,3 ప్రతివాదులకు నోటీసులు

JDr. No. 2 బ్రాంహణపల్లి షాకీర, W/o లేట్ బి.ఖాదర్ వలి, వయస్సు 60 సం...లు, D-No. 10-50, టిప్పు సుల్తాన్ వీధి, కదిరి టౌన్ మరియు మండలము, శ్రీ సత్యసాయి జిల్లా. JDr. No. 3 బ్రాంహణపల్లి షభాన @ యం.షభాన, W/o లేట్ బి.బాబ్ జాన్, వయస్సు 37 సం..లు, D.No. 1-458-ఏ3, గాంధీ నగర్, కదిరి టౌన్ మరియు మండలము, శ్రీ సత్యసాయి జిల్లా.

అయిన మీకు తెలియజేయడమేమనగా పై కేసులో మీ హాజరు నిమిత్తము పై కోర్టు వారు 20-08-2025వ తేదీకి వాయిదా వేసినారు. సదరు వాయిదా రోజున ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఏవైనా ఉన్న యెడల తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కానీ యెడల పై కేసును మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:20/08/2025
స్థలం:కదిరి

M. పఠాన్ జాఫర్ ఖాన్,
డిక్రీహోల్డర్ తరపున వకీలు, సెల్ నెం: 9440988774